# ముగ్గురు మానవహక్కుల నాయకుల హత్యలు

భారత శిక్షాస్మృతిని సవరించకుండానే భారతప్రభుత్వం ఒక కొత్త 'నేరాన్ని' చేర్చి, దానికి శిక్ష మరణమేనని నిర్ణయించినట్టుంది. ఆ నేరం 'మానవహక్కుల గురించి మాట్లాడటం'. 'అదృశ్యం' చేసి రహస్యంగా చంపడమో లేదా గుర్తుతెలియని వ్యక్తులచేత చంపించడమో దీనికి వాళ్లు విధిస్తున్న శిక్ష. కాశ్మీర్‌లో జలీల్ అంద్రబిని, పంజాబ్‌లో జస్వంత్‌సింగ్ ఖల్రాను పారామిలటరీ చేత, పోలీసుల చేత ప్రభుత్వం యిటీవల ఈ విధంగా 'శిక్షించింది'. మరో మానవహక్కుల కార్యకర్త పరాగ్‌కుమార్ దాస్‌ను అస్సాంలో 'సుల్ఫా' మిలిటెంట్లు చంపారని భావిస్తున్నారు.

ఈ ముగ్గురికీ ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం తన నివాళులు అర్పిస్తోంది. ఎ.పి.సి.ఎల్.సి కూడా రాజ్యహింస కారణంగా ముగ్గురు కార్యకర్తలను కోల్పోయిన విషయం విదితమే.

## జలీల్ అంద్రబి హత్య

జమ్మూకాశ్మీర్‌లో సీనియర్ న్యాయవాది, మానవహక్కుల కార్యకర్త, కాశ్మీర్ న్యాయవేత్తల కమిషన్ అధ్యక్షుడు అయిన జలీల్ అంద్రబి ఈ సంవత్సరం మార్చిలో హత్య చేయబడ్డారు. హత్య ఎప్పుడు, ఎక్కడ జరిగిందనే దగ్గరనుంచి హంతకులు ఎవరనేదాకా అంతా అస్పష్టమే. అంటే అస్సలు తెలియదని కాదు, తెలుసు. ఆమాటకొస్తే అందరికీ తెలుసు. అయితే అధికారికంగా చెప్పగలిగింది కాదు. ఎందుకంటే అది ప్రభుత్వమే 'అనధికారికంగా' చేయించిన హత్య. ఇక దర్యాప్తులు, రుజువులు ఎలా వుంటాయి?

శ్రీనగర్ శివార్లలోని హైదర్‌పుర్ దగ్గర మార్చి 8వ తేదీ సాయంత్రం 5.15కి జనమంతా చూస్తుండగా జలీల్ అంద్రబిని కారులోంచి బయటకీడ్చి ఒక సైనిక వాహనంలోకి ఎక్కించారు. న్యాయవాది అయిన ఆయన భార్య రఫత్ ఆరా అదే కారులో వున్నారు. ఇద్దరూ కలిసి కోర్టునుంచి యింటికి వెళుతున్నారు. ఈ సంఘటనను అక్కడి దుకాణదారులు చాలామంది చూశారు. అంద్రబిని కారునుంచి బయటకీడ్చిన వ్యక్తి తలపాగా ధరించిన మేజరు అని, రాష్ట్రీయ రైఫిళ్లకు చెందినవాడని భార్య, మిగతా ప్రత్యక్షసాక్షులందరూ చెప్పారు. రాష్ట్రీయ రైఫిళ్లకు చెందిన సైనికులు గంటనుంచి అన్ని వాహనాలూ ఆపి ఎవరో ఒక మనిషి కోసం వెతుకుతున్నారని కూడా వాళ్లు చెప్పారు. ఆరోజే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మర్నాడే హైకోర్టు బార్ అసోసియేషన్ హెబియస్ కార్పస్ పిటిషన్ వేసింది. అంద్రబి జాడ తెలపమని, న్యాయవాదులకు ఆయన్ని కలుసుకునే అవకాశం యివ్వమని న్యాయమూర్తి బషీర్ అహమ్మద్ ఖాన్ చట్టాన్ని అమలుచేసే అన్ని రాష్ట్ర, కేంద్ర సంస్థలకు ఆదేశాలు జారీచేశారు. రెండురోజుల తర్వాత అన్ని సంస్థలకూ వెంటనే జవాబు చెప్పమని న్యాయమూర్తి మళ్లీ తాఖీదు యిచ్చారు. అయినా తమకేమీ తెలియదని అందరితో పాటు రాష్ట్రీయ రైఫిళ్ల సంస్థ కూడా జవాబిచ్చింది. శ్రీనగర్ లోయలోని అన్ని కోర్టుల్లోనూ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పనులను బహిష్కరించారు. ఢిల్లీలోని పౌరహక్కుల సంఘాలూ, జాతీయ మానవహక్కుల కమిషన్ మౌనం వహించినా లండన్‌లోని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ మాత్రం ఆయనను వెంటనే 'అంతరాత్మ ఖైదీ', **(prisoner of conscience)** గా ప్రకటించింది. అయినా అంద్రబి సజీవంగా తిరిగి రాలేదు.

అపహరింపబడ్డ 19 రోజుల తర్వాత మార్చి 27న అంద్రబి శవం శ్రీనగర్‌లోనే ఒక నదిలో కనిపించింది. అప్పటికే బాగా ఉబ్బిపోయి వుంది. నుదుటి మీద తూటా రంధ్రం వుంది. శరీరమంతా చిత్రహింసల గుర్తులున్నాయి. రెండు కనుగుడ్లూ పీకేసి వున్నాయి. చనిపోయి కనీసం 14 రోజులు అయివుండొచ్చని శవపరీక్ష చేసిన డాక్టర్ చెప్పారు. అంటే ఐదురోజుల చిత్రహింసల తర్వాత కాల్చిచంపి, రెండువారాల తర్వాత శవాన్ని నదిలోకి విసిరేశారన్నమాట.

దీనికి ముందు యిదే సంవత్సరం జనవరి 29న, మళ్లీ 30న జలీల్ అంద్రబిని ఆయన యింటిలోనే హత్య చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. మొదటిరోజున యిద్దరు వ్యక్తులు క్లయింట్లమని చెప్పి యింట్లోకి వచ్చారు. అమ్మను, చెల్లిని తీసుకొస్తాననే నెపంమీద ఒకడు బయటికి వచ్చినపుడు అప్పుడే యింట్లోకి వస్తున్న అంద్రబి తమ్ముడికి అనుమానం వచ్చింది. రెండు టాక్సీలలో 8మంది సాయుధులు కూర్చుని వుండడాన్ని గమనించాడు. అదే సమయంలో వేరేవాళ్లు కూడా రావడంతో వీళ్లు పారిపోయారు. వీళ్లను లొంగిపోయిన మిలిటెంట్లుగా

కాలనీ వాచ్‌మెన్ గుర్తించాడు. మర్నాడు ఆ ఇద్దరే మళ్లీ వచ్చారు. సాయుధులైన మరో ఇద్దరితో కలిసి కారులో రాగానే అంద్రబి వాళ్లను ఫోటోలు తీసే ప్రయత్నం చేస్తే కంగారుపడి పారిపోయారు. వెళ్లేముందు అంద్రబిని తీవ్రంగా హెచ్చరించి వెళ్లారు. ఇది జరిగాక ఆయన పత్రికలకు యిచ్చిన ఇంటర్వ్యూలో 'గత సంవత్సరం నేను జెనీవా నుంచి తిరిగొచ్చాక ప్రభుత్వం నన్ను తన హిట్‌లిస్ట్‌లో పెట్టిందని, నేను జాగ్రత్తగా వుండాలని ప్రభుత్వంలోని నా మిత్రులు కొందరు హెచ్చరించిన'ట్లుగా చెప్పారు. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్ సమావేశంలో పాల్గొనడానికీగాను ఆయన జెనీవా వెళ్లారు. ఈ ఏడాది మార్చి 18న కూడా ఆయన అదే సమావేశానికి మళ్లీ వెళ్లాల్సి వుంది. ఈలోగా రాష్ట్రీయ రైఫిళ్లు ఆయన్ని తమ పద్ధతిలో వెళ్లకుండా అడ్డుకున్నాయి.

ఈ రాష్ట్రీయ రైఫిళ్లు బి.ఎస్.ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్ లాగే ఒక పారా మిలిటరీ బలగం. వ్యతిరేక తిరుగుబాటు దారులను (కౌంటర్

# బీహార్ ముద్దాయిల మరణదండన రద్దు

తొమ్మిదేళ్ల క్రింద బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ జిల్లాలోని దలేల్‌చక్- బాగౌరా గ్రామాలలో 42 మంది అగ్రకుల రాజ్‌పుట్‌లను వెనుకబడిన యాదవ కులస్తులు మూకుమ్మడిగా ఊచకోత కోసి చంపిన ఘటనలో ఔరంగాబాద్ సెషన్స్ కోర్టు 8 మంది యాదవులకు విధించిన మరణదండనను సుప్రీంకోర్టు ఈ ఏప్రిల్ నెలలో కొట్టేసి యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. మూడేళ్ల క్రింద ఔరంగాబాద్ సెషన్స్ కోర్టు విధించిన మరణదండనను వెనువెంటనే పాట్నా హైకోర్టు ధృవీకరించింది. దానిపైన సుప్రీంకోర్టులో నడిచిన అప్పీల్‌లో ముద్దాయిల తరఫున రాజేంద్రప్రసాద్ సింగ్, బి. కాంతారావు, కె.జి.కన్నబిరాన్ వాదించారు.

ముద్దాయిలు ఎనిమిది మందీ బాగౌరా గ్రామానికి చెందినవారు. వారిపేర్లు జగ్‌నారాయణ యాదవ్, బాబురాం యాదవ్, చంద్రదేవ్ యాదవ్, రాంకేశ్వర్ యాదవ్, రాంప్రవేశ్ యాదవ్, చింతామన్ యాదవ్, రాజారాం యాదవ్, బ్రహ్మదేవ్ యాదవ్. నిజానికి మూకుమ్మడి హత్యాకాండలో పాల్గొన్నది వందల మంది. 1987 ఏప్రిల్ నెలలో అదే పోలీస్‌స్టేషన్ (మదన్‌పూర్) పరిధిలోని చోట్కీ-చేచాని గ్రామంలో రాజ్‌పుట్ కులస్తులు యాదవులను మూకుమ్మడిగా హత్య చేసిన ఘటనకు ప్రతీకారంగా మే నెలలో యాదవులు ఉలేల్‌చక్, బాగౌరా జంట గ్రామాలలో రాజ్‌పుట్‌లపైన అతిక్రూరంగా ప్రతీకారం తీర్చుకున్నారు. స్త్రీలను, పిల్లలను కూడ విడవకుండా హతమార్చారు. ఒకేరాత్రి 42 మంది చనిపోయారు. ఈ ఘటనకు మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్(ఎంసిసి) ప్రోద్బలం వుంది. ఈ హత్యాకాండలోని విచక్షణా రాహిత్యాన్ని తప్పకుండా విమర్శించాల్సిందే కానీ దాని వెనుకనున్న సాంఘిక ఘర్షణను గుర్తించాలి. అగ్రకుల భూస్వాముల దాడులలో దళిత, వెనుకబడిన కులాలవారు తరచుగా బలయ్యే బీహార్ రాష్ట్రంలో వెనుకబడిన కులాలవారు ప్రతీకారం తీర్చుకున్న అరుదయిన ఘటనలలో ఇదొకటి.

అగ్రకులాలు హత్యాకాండకు పాల్పడిన ఘటనలో కేసులుపెట్టడం, విచారించడం, శిక్షించడం బీహార్‌లో ఎప్పుడోగానీ జరగదు. పోలీసు వ్యవస్థలోని అగ్రకుల పక్షపాతం దీనికొక కారణం. మరొక కారణం ఆ రాష్ట్రంలో 'శాంతిభద్రతలు' పూర్తిగా ప్రైవేటీకరించబడడం. ఏప్రిల్‌నెలలో జరిగిన చోట్కీ-చేచాని దాడిలో కూడ ఒక్కరికీ శిక్షపడలేదు. దలేల్‌చక్- బాగౌరా ఘటనలో సహితం ఒకేఒక్క ఇంట్లో జరిగిన హత్యాకాండకు సంబంధించి సెషన్స్ కోర్టులో కేసు నడిచింది. ఆ కేసులోనే 8 మందికి మరణదండన పడింది.

సుప్రీంకోర్టు మరణదండన చెల్లదని తీర్పు ఇవ్వడానికి పై సాంఘిక విశ్లేషణ కారణం కాదు. సాక్ష్యాలు అంత గట్టి శిక్ష వేయడానికి సరిపోయేంతగా లేవని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. నిజానికి సెషన్ కోర్టు దాకా వచ్చి సాక్ష్యం చెప్పిన ప్రత్యక్షసాక్షి ఒకే ఒక్కడు. అతను అప్పటికి 8 సంవత్సరాల వయసున్న బాలుడు. ఈ బాలుడి సాక్ష్యం తప్ప వేరే ఏ ప్రత్యక్ష సాక్ష్యమూ లేదు. అతను క్రాస్ ఎగ్జామినేషన్‌లో వకీళ్లు ఎన్ని మెలికలు తిప్పినా తొణకకుండా జవాబిచ్చాడన్న కారణం చూపించి పాట్నా హైకోర్టు మరణదండనను ధృవీకరించింది. అయినప్పటికీ ఒకేఒక బాలుడి సాక్ష్యంతో 8 మందిని ఉరితీయడం న్యాయం కాదని సుప్రీంకోర్టు భావించి మరణదండనను రద్దుచేసి యావజ్జీవ ఖైదుగా మార్చింది.

ఈ కేసు అప్పీల్ సుప్రీంకోర్టులో దాఖలు కావడానికి పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రాటిక్ రైట్స్ (పియుడిఆర్), ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ముద్దాయిలకు సహాయం చేసాయి.

ఇన్సర్జెంట్స్) అదుపు చేయడం దీని బాధ్యత. అయితే లొంగిపోయిన తీవ్రవాదులకు ఆయుధాలిచ్చి, గ్రూపులు పెట్టించి, మిలిటెంట్లను, తమకు 'యిబ్బంది' కలిగిస్తున్న ఇతరులను వాళ్లద్వారా చంపించడం రాష్ట్రీయ రైఫిళ్లు చేస్తున్న ప్రధానమైన పని. వీళ్ల రక్షణలో ఈ వ్యతిరేక తిరుగు బాటు దారులు జనాన్ని బెదిరించి డబ్బులు వసూలు చేయడం, రేపులు చేయడం, కాళ్లూచేతులు వరకడం వగైరా దుర్మార్గపు పనులెన్నో చేస్తున్నారు. జలీల్ అంద్రబిని చంపడానికి మొదట వీళ్లనే నియోగించినట్టున్నారు కాని మొదటి రెండు ప్రయత్నాలూ విఫలమవడంతో చివరికి రాష్ట్రీయ రైఫిళ్లే రంగంలోకి దిగారు. జమ్ము కాశ్మీర్‌లో మానవహక్కుల కార్య కర్తను హత్యచేయడం యిది రెండవసారి. ఎన్నో హెబియస్ కార్పస్ పిటిషన్లు వేసి ఎందరి ప్రాణాలనో కాపాడడానికి ప్రయత్నించిన డబ్ల్యు.ఎన్. వాంచూను 1992 డిసెంబర్ 25న హత్య చేశారు. 'ఈ హత్యలో అధికార యంత్రాంగం హస్తం వున్నదని కాశ్మీర్ ప్రజలు అనుమానిస్తున్న'ట్లు ఆమ్నెస్టీ సైతం పేర్కొంది.

జలీల్ అంద్రబి 1993 నుంచి హైకోర్టులో అనేక పిటిషన్లు వేసి నిర్బంధ శిబిరాలలో, ఇంటరాగేషన్ కేంద్రాలలో పరిస్థితులను మెరుగు పరచడానికి ప్రయత్నించారు. ఈ కేంద్రాలలో 'కనీస మానవ సౌకర్యాల'ను ఏర్పాటు వేయమని కోరుతూ ఆయన హైకోర్టు బార్ అసోసియేషన్ తరపున మొదట ఒక పిటిషన్ వేశారు. ఈ శిబిరాలను పరిశీలించి నివేదిక సమర్పించమని హైకోర్టు జడ్జి పారే జమ్ము జిల్లా సెషన్స్ జడ్జిని ఆదేశించారు. అంద్రబి వేసిన మరో పిటిషన్‌ను స్వీకరిస్తూ జస్టిస్ ఎస్.ఎం. రిజ్వి 1994 అక్టోబర్ 17న ఈ కింది వ్యాఖ్యలు చేశారు. మనదేశంలో ఎవరూ పట్టించుకోకపోయినా వీటికి విదేశాలలో మాత్రం విస్తృత ప్రచారం లభించింది.

'అక్రమ నిర్బంధితుల గురించి వందలాది కేసులు నా దృష్టికి వచ్చాయి. ఈ కోర్టు ఎన్నిసార్లు గట్టిగా ఆదేశాలిచ్చినా వారిని వదలడం లేదు. జాడతెలియని నిర్బంధితుల గురించి కూడా అనేక వందల కేసులు పెండింగ్‌లో వున్నాయి. అరెస్టు చేసినవాళ్లను చంపేశారని ఆరోపిస్తూ కూడా అనేక కేసులు కోర్టు దృష్టికి వచ్చాయి. ఎటువంటి చట్టబద్ధమైన ఆదేశం లేకుండా డిటెన్యూలను ఏళ్లతరబడి జైళ్లలో, సబ్ జైళ్లలో, ఇంటరాగేషన్ సెంటర్లలో ఉంచేస్తున్నారు. శాంతిభద్రతల యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. చట్టాన్ని అమలుచేయడానికి ఏర్పడిన సంస్థలు ఈ కోర్టును కూడా నిస్సహాయంగా మార్చేశాయని చెప్పడానికి నేనేమీ సిగ్గుపడడం లేదు. ఈ కోర్టు ఆదేశాలను ఎవరూ గౌరవించడం లేదు. వేలాది ఆదేశాలకు ప్రభుత్వం నుంచి, ఈ సంస్థలనుంచి ఎటువంటి జవాబులూ రావడం లేదు'.

అంద్రబి పిటిషన్ ఫలితంగా న్యాయవ్యవస్థ కదిలి పూంచ్, కతువా, బారాముల్లా, అనంతనాగ్ జిల్లాల నిర్బంధ శిబిరాలలోని భయంకర పరిస్థితులను పరిశీలించి నివేదికలు సమర్పించింది. ఏ చట్టం కిందా అరెస్టు కాని వాళ్లెందరో ఉన్నారని యివి వెల్లడించాయి. ఒక లాయరుకి ఇది చిన్న విజయమేమీ కాదు. తన పిటిషన్ మీద జస్టిస్ రిజ్వి చేసిన కొన్ని వ్యాఖ్యలు స్వయంగా తన విషయంలోనే వర్తించే రోజొకటి వస్తుందని ఆయన ఏమాత్రం ఊహించి వుండరు: 'పోలీసు శాఖలు, పరిపాలనా యంత్రాంగం చట్టబద్ధ పాలనకు పూర్తిగా తిలోదకాలిచ్చినట్లు కనిపిస్తోంది. వాళ్లు అన్నిరకాల చట్టవ్యతిరేక పనులకూ పాల్పడుతున్నారు. నేరస్థులు, టెర్రరిస్టులు కూడా వీళ్లను చూసి సిగ్గుపడొచ్చు'.

నూరాని 'ది స్టేట్స్‌మన్'లో రాసిన వ్యాసం ఆధారంగా)

> ''అక్రమ నిర్బంధితుల గురించి వందలాది కేసులు నా దృష్టికి వచ్చాయి. ఈ కోర్టు ఎన్నిసార్లు గట్టిగా ఆదేశాలిచ్చినా వారిని వదలడం లేదు. జాడతెలియని నిర్బంధితుల గురించి కూడా అనేక వందల కేసులు పెండింగ్‌లో వున్నాయి. అరెస్టు చేసినవాళ్లను చంపేశారని ఆరోపిస్తూ కూడా అనేక కేసులు కోర్టు దృష్టికి వచ్చాయి. ఎటువంటి చట్టబద్ధమైన ఆదేశం లేకుండా డిటెన్యూలను ఏళ్లతరబడి జైళ్లలో, సబ్ జైళ్లలో, ఇంటరాగేషన్ సెంటర్లలో ఉంచేస్తున్నారు. శాంతిభద్రతల యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. చట్టాన్ని అమలుచేయడానికి ఏర్పడిన సంస్థలు ఈ కోర్టును కూడా నిస్సహాయంగా మార్చేశాయని చెప్పడానికి నేనేమీ సిగ్గుపడడం లేదు. ఈ కోర్టు ఆదేశాలను ఎవరూ గౌరవించడం లేదు. వేలాది ఆదేశాలకు ప్రభుత్వం నుంచి, ఈ సంస్థలనుంచి ఎటువంటి జవాబులూ రావడం లేదు''
>
> \- జస్టిస్ ఎస్.ఎం. రిజ్వి

## జస్వంత్‌సింగ్ ఖల్రా 'అదృశ్యం'


జస్వంత్‌సింగ్ ఖల్రా అకాలీదళ్ మానవహక్కుల విభాగానికి ప్రధాన కార్యదర్శి. 1995 సెప్టెంబర్ 6వతేదీ ఉదయం 9.15 గంటలకు

ఆయనను పోలీసులు యింటినుంచే తీసుకెళ్లారు. ఆ తర్వాత ఎవరూ ఆయన్ని యింతవరకు చూడలేదు. ఆయన భార్య వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌కి 'ఖల్రాను తాము నిర్బంధించనే లేద'ని పంజాబ్ పోలీసులు సమాధానమిచ్చి ఊరుకున్నారు.

పంజాబ్ పోలీసులు 1992లో కనీసం 3000 మృతదేహాలను రహస్యంగా పూడ్చిపెట్టారనే విషయం మొదటిసారి బహిర్గతం చేసింది ఖల్రావే. అమృత్‌సర్ జిల్లాలోని అన్ని స్మశానాల రికార్డులనుంచి ఊరూపేరూ లేకుండా సమాధి చేయబడ్డవారి సంఖ్యను సేకరించి వీరు పోలీసుల అరెస్టు తర్వాత 'అదృశ్యమైన' వ్యక్తులు కావొచ్చని ఆయన వెల్లడించారు. పంజాబ్, హర్యానా హైకోర్టులో ఒక పిటిషన్ కూడా వేశారు కాని 'అదృశ్య'మైన వారి కుటుంబ సభ్యులు మాత్రమే పిటిషన్లు వేయాలనే కారణం మీద కోర్టు దాన్ని కొట్టేసింది. ఇది జరిగిన కొద్దిరోజులకే 'ఇంకొకర్ని మాయం చేయడం తమకు కష్టం కాద'ని ఒక పోలీసు అధికారి ఖల్రాను బెదిరించాడు. చివరికి అదే జరిగింది. పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్‌సింగ్ హత్య తర్వాత వందలాది అరెస్టులు, అక్రమ నిర్బంధాలు జరిగిన సమయంలో పోలీసులు దాన్ని అవకాశంగా తీసుకుని ఖల్రాను శాశ్వతంగా మాయం చేశారు.

## పరాగ్‌దాస్ హత్య

మరొక మానవహక్కుల నాయకుడు పరాగ్‌కుమార్ దాస్‌ను గౌహతిలో మే 17న పట్టపగలు నడిరోడ్డులో దారుణంగా కాల్చిచంపారు. హంతకులు సుల్ఫాకి (SULFA - సరెండరయిన ఉల్ఫా తీవ్రవాదుల సంఘం) చెందినవాళ్లని పరాగ్ మిత్రులు, సహచరులు భావిస్తున్నారు. హత్యలో ఇద్దరు, ముగ్గురు అధికారుల హస్తం ఉందనే అనుమానం కూడా ఉంది. అనేక సంవత్సరాలుగా జరుగుతున్న జాతి ఘర్షణలతో అల్లకల్లోలమైన అస్సాంలో పరాగ్‌దాస్ మానవ్ అధికార్ సంగ్రామ్ సమితి (మాస్), గణతంత్రిక్ అధికార్ సంగ్రామ్ సమితి (గాస్) అనే రెండు మానవ హక్కుల సంఘాలను నెలకొల్పి మానవహక్కుల పరిరక్షణకై ఎంతో కృషి చేశారు. 'అసోమియా ప్రతిదిన్' అనే అస్సామీ పత్రికకు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ హోదాలో కూడా ఆయన తన కలాన్ని మానవహక్కులను కాపాడడానికి వినియోగించారు.



మే 10-17 మధ్య అస్సాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోయి, గణపరిషత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయం లో 'ఉల్ఫా' ఆరుగురు 'సుల్ఫా' మనుషులను, ఒక జిల్లా ఎస్.పిని చంపింది. దీనికి ప్రతీకారంగానే 'సుల్ఫా' పరాగ్‌దాస్‌ను హత్య చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

### పాఠకులకు విజ్ఞప్తి

*చందా అయిపోయినవాళ్లు 20 రూ. పంపి తమ చందాను పునరుద్ధరించుకోవాల్సిందిగా కోరుతున్నాం. చిరునామా మారినవాళ్లు కూడా ఆ విషయాన్ని ఈ క్రింది అడ్రసుకు తెలియజేయండి.*

ఎస్.ఎస్.సి. బోస్
రామనాథం ఛాంబర్ ఆఫ్ లా
పెద్దిబొట్లవారి వీధి, గవర్నర్‌పేట
విజయవాడ - 520 002

### BOOK POST - PRINTED MATTER

..................................................
..................................................
..................................................
..................................................
..................................................
pin ..............................................

Edited, Printed & Published by M. Kodandarami Reddy on behalf of Andhra Pradesh Civil Liberties Committee, 1-9-312 B2, Vidyanagar, Hyderabad - 500 044. Printed at Charitha Printers, Hyderabad on behalf of Ravi Printing Press, Governorpet, Vijayawada - 2.